క్లుప్తంగా

గాయపడిన ఇద్దరికి ఎక్స్‌గ్రేషియా



వాజేడు: విద్యుత్ తీగల బారిన పడి గాయపడిన వారికి శుక్రవారం యానిమల్ యాక్సిడెంట్ స్కీమ్ ద్వారా ఎక్స్‌గ్రేషియాను నూగూరు మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పూనెం రాంబాబు చేతుల మీదుగా అందించారు. మండల పరిధి కృష్ణాపురం గ్రామానికి చెందిన పూనెం ఏసుపతికి రూ 40,000, బురుక సాలయ్యకు రూ.80,000 విలువైన చెక్కులు అందించారు. 2022లో గాలి దుమారాల మూలంగా విద్యుత్ వైర్లు తెగి పడడంతో వీరు గాయపడ్డారు. దానికి గాను వారు దరఖాస్తులు చేసుకోగా.. అందుకు సంబంధించిన ఎక్స్‌గ్రేషియా చెక్కులు ఇప్పుడు వచ్చినట్లు విద్యుత్ ఏఈ అర్షద్ అహ్మద్ తెలిపారు.

సకాలంలో అందించాలి



వాజేడు: వచ్చే వార్షిక సంవత్సరం ప్రారంభానికి సకాలంలో విద్యార్థులకు దుస్తులను అందించాలని ఎంఈఓ తేజావత్ వెంకటేశ్వర రావు అన్నారు. శుక్రవారం స్థానిక విద్యా వనరుల కేంద్రంలో దుస్తులను కుట్టి ఇచ్చే సెర్ప్ మహిళలకు స్కూల్ యూనిఫాం కోసం బట్టలను అందజేశారు. వచ్చే విద్యా సంవత్సరంలో విద్యార్థులకు ఒక్కో జత కోసం ముందుగా కుట్టిస్తున్నట్లు ఎంఈఓ తెలిపారు.

వాటర్ కూలర్ అందజేత



వెంకటాపురం(కె): మండల కేంద్రంలోని ప్రభుత్వ వైద్యశాలకు హైదరాబాద్‌కు చెందిన కోశా సుందర సుబ్బారావు అతడి తండ్రి నర్సింహారావు జ్ఞాపకార్థం శుక్రవారం వాటర్ కూలర్‌ను అందజేశారు. వైద్యాధికారి శివాజీ, బీఆర్ఎస్ నాయకులు లక్ష్మీనారాయణ తదితరులు ఉన్నారు.

గోమాతకు అంత్యక్రియలు



వెంకటాపురం(ఎం): పెంచుకున్న ఆవు (గోమాత) అనారోగ్యంతో మృతిచెందగా కుటుంబ సభ్యులు అంత్యక్రియలు నిర్వహించిన సంఘటన మండలంలోని పాలంపేటలో శుక్రవారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. పాలంపేట గ్రామానికి చెందిన బోడ మహేందర్-రమ దంపతులు నాలుగేళ్లుగా ఆవును పెంచుకుంటున్నారు. కాగా, అనారోగ్యానికి గురైన ఆవు మృతిచెందింది. మృతి చెందిన ఆవును ట్రాక్టర్‌లో వేసుకొని గ్రామంలో ఊరేగించారు. దహన సంస్కారాలకు గ్రామస్తులు కూడా అధికసంఖ్యలో హాజరయ్యారు. అనంతరం గ్రామశివారులో ఖననం చేసి గోమాతతో తమకు ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ మహేందర్ కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతమయ్యారు. గోమాతకు అంత్యక్రియలు నిర్వహించడంపై మహేందర్‌ను గ్రామస్తులు, జంతు ప్రేమికులు అభినందించారు.

పంట పొలాల్లోకి దూసుకెళ్లిన లారీ

ములుగు రూరల్: పంట పొలాల్లోకి లారీ దూసుకెళ్లిన సంఘటన మండలంలోని జాకారం సమీపంలో శుక్రవారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. ఏటూరునాగారం నుంచి హనుమకొండ వైపు వెళ్తున్న ఇసుక లారీ జాకారం సమీపానికి చేరుకోగానే అదుపుతప్పి పంట పొలాల్లోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి.

సమయపాలన ఏది?



ముప్పనపల్లిలో విద్యార్థులతో ప్రార్థన చేయిస్తున్న ఉపాధ్యాయురాలు



జిల్లా పరిషత్ పాఠశాలలో వరండాలో కూర్చోబెట్టి బోధిస్తున్న ఉపాధ్యాయుడు

- ఉదయం ఎనిమిది గంటలకు పాఠశాలలు ప్రారంభం
- తొమ్మిది తర్వాతనే వస్తున్న కొంత మంది ఉపాధ్యాయులు
- పట్టించుకోని అధికారులు

కన్నాయిగూడెం: మండలంలోని కొంత మంది ప్రభుత్వ ఉపాధ్యాయులు పాఠశాలలకు సరైన సమయానికి హాజరు కావడం లేదనే విమర్శలు వస్తున్నాయి. పాఠశాలలకు ఈ నెల 15 నుంచి ఒంటి పూట బడులు ప్రారంభమయ్యాయి. కాగా, ఉదయం ఎనిమిది గంటలకు పాఠశాలలో ప్రార్థనకు ఉపాధ్యాయులు హాజరు కావాలి. కానీ పాఠశాలకు ఒక్కరూ లేదా ఇద్దరు మాత్రమే హాజరై మిగిత వారు తర్వాత వస్తున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. హనుమకొండ, ములుగు సుదూర ప్రాంతాల నుంచి ఉదయం తొమ్మిది తర్వాత పాఠశాలకు చేరుకుంటున్నట్లు తెలుపుతున్నారు. కాగా, తిరిగి మధ్యాహ్నం 12 గంటల వెళ్తున్నారని తెలుస్తోంది. స్థానికుల సమాచారంతో గురువారం 'సాక్షి'మండలంలోని ముప్పనపల్లి జిల్లా పరిషత్, మండల పరిషత్ పాఠశాలలను సందర్శించింది. మండల పరిషత్ పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడితో పాటు ఐదుగురు ఉపాధ్యాయులు ఉండగా ఉదయం ఎనిమిది గంటలకు ఒకరూ మాత్రమే హాజరై విద్యార్థులతో ప్రార్థన చేయించి తరగతి గదిలో కూర్చోపెట్టారు. అలాగే జిల్లా పరిషత్ పాఠశాలలో కూడా ఒక ఉపాధ్యాయుడు మాత్రమే అన్ని తరగతుల విద్యార్థులను పాఠశాల భవనం వరండాలో కూర్చోబెట్టారు. ఈ పాఠశాలలో 10 మంది రెగ్యూలర్, ఒక కాంటాక్ట్ ఉపాధ్యాయుడు మొత్తం 11 మంది విధులు నిర్వహిస్తున్నారు. ఇందులో పదోతరగతి పరీక్షల డ్యూటీలో ఇద్దరు ఉండగా మరొకరు సెలవులో ఉన్నట్లు హాజరైన ఉపాధ్యాయుడు బాలరాజు తెలిపారు. మిగత వారు ఏటూరునాగారం నుంచి వచ్చే బస్సుకు బయల్దేరి తొమ్మిది గంటలకు రానున్నట్లు తెలిసింది. కాగా ఎంఈఓ శ్రీనివాస్ ముప్పనపల్లి జిల్లా పరిషత్ పాఠశాల హెచ్ఎం కావడం గమనర్హాం. ఈ పాఠశాలలోనే పరిస్థితి ఇలా ఉంటే మండలంలోని మిగితా పాఠశాలల పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. అందుబాటులో ఉండి విద్యార్థులకు విద్యాబోధన చేయాల్సిన ఉపాధ్యాయులే సమయానికి రాకుంటే విద్యార్థుల భవిష్యత్ ఎలా అని మండల ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైన సమయానికి వచ్చే విధంగా చూడాలని అధికారులను విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

దాటవేసే సమాధానం చెప్పిన ఎంఈఓ

ఉపాధ్యాయుల సమయపాలన విషయంపై ఎంఈఓ శ్రీనివాస్‌ను ఫోన్‌లో సమాచారం కోరగా 'పదో తరగతి పరీక్షల డ్యూటీలో ఉన్నా, మీకు సమాచారం ఎందుకు చెప్పాలి, ఏమి వార్త రాస్తున్నారో చెప్పితే గాని సమాచారం చెప్పమంటూ, ఏదైన ఉంటే అక్కడ ఉన్నవారినే అడగండి' అని దాటవేసే సమాధానం ఇచ్చి ఫోన్ మధ్యలోనే కట్ చేశారు.

ఇంకుడు గుంతలతో భూగర్భజలాల పెంపు

- గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ బానోత్ రవిచందర్



కొబ్బరికాయ కొడుతున్న రవిచందర్

ములుగు: ఇంకుడు గుంతలతో భూగర్భ జలాల పెంపు సాధ్యం అని గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ బానోత్ రవిచందర్ అన్నారు. ఈమేరకు జిల్లా కేంద్రంలోని గ్రంథాలయ ఆవరణలో శుక్రవారం డీపీఓ ఒంటేరు దేవరాజ్‌తో కలిసి రవిచందర్ ఇంకుడు గుంత పనిని కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. గ్రంథాలయ అభివృద్ధికి కట్టుబడి ఉన్నామన్నారు. పాఠకుల సౌకర్యార్థం ఇప్పటికే మోడల్ మరుగుదొడ్లు నిర్మించామని, ఇంకుడు గుంత పనిని త్వరతిగతిన పూర్తి చేయాలన్నారు. మోడల్ గ్రంథాలయ నిర్మాణానికి మంత్రి డాక్టర్ ధనసరి సీతక్క అన్ని సహాయ సహకారాలు అందిస్తున్నారన్నారు. పాఠకులు, నిరుద్యోగులకు అవసరమైన పోటీ పుస్తకాలను అందుబాటులో ఉంచుతున్నట్లు తెలిపారు. ఆయన వెంట ఎంపీడీఓ రామకృష్ణ, ఈఓ పెంట రఘు, భాస్కర్, రజనీకర్‌రెడ్డి, బొచ్చు సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

శివాలయంలో సీసీ కెమెరాల ఏర్పాటు



స్తంభానికి అమర్చుతున్న సీసీ కెమెరాలు

ఏటూరునాగారం: మండల కేంద్రంలోని శ్రీ ఉమా రామలింగేశ్వరస్వామి ఆలయ సంరక్షణ కోసం మూడు సీసీ కెమెరాలను సీఐ శ్రీనివాస్, ఎస్సై తాజొద్దీన్ సాకారంతో ఏర్పాటు చేసినట్లు ఆలయ చైర్మన్ మడుగూరి ప్రసాద్ తెలిపారు. శుక్రవారం ఆలయంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ.. ఆలయ, భక్తుల భద్రతకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో శివాలయం డైరెక్టర్లు ఇరవేణి రాంలాల్, ఇర్సవడ్ల కిరణ్, వలస తిరుపతి, కట్కూరి రాధిక, కర్ల అరుణ, దుర్గం కొమురయ్య, సోమందపు నర్సింహులు, పెద్దబోయిన అర్జున్, గార పోషలు, కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి ముక్కెర లాలయ్య, తాండ్ర శ్రీను, కంపెల్లి భాగ్య, బట్టు ప్రవీణ్, పెద్దబోయిన యాదగిరితో పాటు తదితరులు పాల్గొన్నారు.

బయో మందుల విక్రేతపై కేసు

- రూ.6 లక్షల విలువైన మందులు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన ఏఎస్పీ శివం ఉపాధ్యాయ



సీజ్ చేసిన మందులు చూపిస్తున్న ఏఎస్పీ శివం ఉపాధ్యాయ

ఏటూరునాగారం: అనుమతులు లేకుండా నకిలీ విత్తనాలు బయో మందులు విక్రయిస్తున్న వారిపై కేసులు నమోదు చేసినట్లు ఏఎస్పీ శివం ఉపాధ్యాయ తెలిపారు. శుక్రవారం ఏఎస్పీ కార్యాలయంలో శుక్రవారం మీడియాతో మాట్లాడారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. అనుమతుల్లేకుండా బయో మందులు నిల్వ చేసి ఉంచిన ఒక ఇంట్లో ఎస్సై తాజుద్దీన్ గురువారం అర్ధరాత్రి పోలీస్, అగ్రికల్చర్ శాఖ అధికారులు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించారు. ఆ ప్రదేశంలో రూ.6 లక్షల విలువైన బయోమందులను స్వాధీనం చేసుకున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఎన్టీఆర్ జిల్లా కందిచర్ల గ్రామానికి చెందిన రావూరి వెంకటేశ్వరరావు అనే వ్యక్తి ఏటూరునాగారం మండల కేంద్రంలోని ఆకుల వారి ఘనపురం కాలనీలోని ఒక ఇంట్లో అద్దెకు ఉంటూ ఎలాంటి అనుమతుల్లేకుండా బయోమందులు నిల్వ చేసి వెంకటాపురం(కె), చర్ల ప్రాంతాల్లో విక్రయాలు జరుపుతున్నాడు. నమ్మదగిన సమాచారం మేరకు గురువారం అర్ధ రాత్రి పోలీస్, అగ్రికల్చర్ శాఖల ఆధ్వర్యంలో సంయుక్తంగా దాడులు నిర్వహించారు. నిల్వ చేసి ఉంచిన 410 లీటర్ల ద్రవపదార్థం, 30 కేజీల ఘన పదార్థం గల బయోమందులను పట్టుకున్నారు. పంచనామా నిర్వహించి అనుమతులు లేకుండా విక్రయిస్తున్న బయోమందులను స్వాధీనం చేసుకున్నారు. విక్రయిస్తున్న వ్యక్తిపై శాఖా పరమైన కేసు నమోదు చేశారు. అతడి నుంచి వ్యానును స్వాధీనం చేసుకున్నట్లు ఏఎస్పీ శివం ఉపాధ్యాయ తెలిపారు.

నాణ్యమైన ఆహారం అందించాలి

- ఎంపీడీఓ రాజ్యలక్ష్మి



వంటను పరిశీలిస్తున్న ఎంపీడీఓ రాజ్యలక్ష్మి

ఏటూరునాగారం: మండల కేంద్రంలోని వసతి గృహాలు, ఆశ్రమ పాఠశాలల్లోని విద్యార్థులకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలని ఎంపీడీఓ రాజ్యలక్ష్మి తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని కస్తూరిబాగాంధీ, తాళ్లగడ్డ ఆశ్రమ బాలికల పాఠశాలల్లోని విద్యార్థులకు వండిపెడుతున్న ఆహారాన్ని ఆమె తనిఖీ చేశారు. వంటశాలలు, తాగునీటిని పరిశీలించారు. అలాగే వంటశాలలో నిల్వ చేసే వస్తువులు పాడవకుండా చూసుకోవాలన్నారు. ఆహారం కుళ్లిపోయింది, కాలం చెల్లినవి ఏమైనా ఉంటే వెంటనే జీపీ ట్రాక్టర్ ద్వారా బయటకు పంపించాలన్నారు. విద్యార్థుల ఆరోగ్యం ఎంతో ముఖ్యమన్నారు. కార్యక్రమంలో ఆమె వెంట పంచాయతీ కార్యదర్శి రమాదేవి, సిబ్బంది ఉన్నారు.

ప్రభుత్వం పరిహారం చెల్లించాలి



పరామర్శిస్తున్న సీపీఐ నాయకులు

వెంకటాపురం(కె): అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబానికి ప్రభుత్వం స్పందించి రూ.కోటి పరిహారం చెల్లించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి తోట మల్లికార్జునరావు, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు గడ్డం రామకృష్ణ డిమాండ్ చేశారు. మండల పరిధిలోని చిరుతపల్లికి చెందిన రైతు మధుకృష్ణ ఇటీవల ఆత్మహత్య చేసుకోగా బాధిత కుటుంబాన్ని వారు పరామర్శించి మాట్లాడారు. బాండ్ మొక్కజొన్న సాగు చేసి దిగుబడి రాక అప్పులపాలై ఆత్మహత్య చేసుకున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. వారి వెంట నాయకులు అజాద్ పాషా ఉన్నారు.

అధికారుల నిర్లక్ష్యంతోనే ఆత్మహత్య

ఏజెన్సీలో అధికారుల నిర్లక్ష్యంతోనే మొక్కజొన్న రైతు మధుకృష్ణ ఆత్మహత్య చేసుకున్నాడని బీజేపీ ఎస్టీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొత్త సురేందర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహం ఆవరణంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నకిలీ విత్తనాలు ఇచ్చి రైతు ఆత్మహత్యకు కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని అన్నారు. రైతు కుటుంబానికి నష్ట పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

పదో తరగతి పరీక్షలు ప్రారంభం



వాజేడు: విద్యార్థులను తనిఖీ చేస్తున్న సిబ్బంది



ఏటూరునాగారంలో..

ఏటూరునాగారం: మండల కేంద్రంలో పదో తరగతి పరీక్షలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్‌లో ఏ సెంటర్‌లో 126 మంది, బీ సెంటర్‌లో 140 మందికి వంద శాతం హాజరైనట్లు చీఫ్ సూపరింటెండెంట్ రవీందర్, భద్రయ్య తెలిపారు. అలాగే స్పోర్ట్స్ స్కూల్‌లో 140 మంది హాజరైనట్లు తెలిపారు. పరీక్ష కేంద్రం నుంచి 100 మీటర్ల వరకు 144 సెక్షన్‌ను అమలు చేసినట్లు స్థానిక ఎస్సై తాజొద్దీన్ తెలిపారు.

వాజేడు: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో 123 మంది విద్యార్థులు హాజరయ్యారు. విద్యార్థులను తనిఖీ చేసి పరీక్షల కేంద్రంలోని అనుమతించారు. పరీక్ష కేంద్రాన్ని తహసీల్దార్ శ్రీనివాస్, ఎస్సై రాజ్‌కుమార్, ఎంఈఓ వెంకటేశ్వరరావు తనిఖీ చేశారు. వైద్య సిబ్బంది పరీక్ష కేంద్రం వద్ద క్యాంపును ఏర్పాటు చేశారు.

వెంకటాపురం(కె): మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాల, చిరుతపల్లి బాలికల ఆశ్రమ పాఠశాలలో పదో తరగతి పరీక్షలు ప్రారంభమైయ్యాయి. 275 మంది విద్యార్థులకు గాను 275 మంది హాజరయ్యారు.

మంగపేట: మండలంలో మంగపేట, కమలాపురం, రాజుపేటలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాల్లో 380 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. పరీక్ష కేంద్రాల వద్ద ఎస్సై టీవీఆర్ సూరి 144 సెక్షన్ విధించి బందోబస్తు ఏర్పాటు చేశారు.



ఏటూరునాగారం: హాల్ టికెట్ నంబర్ చూసుకుంటున్న విద్యార్థులు



వెంకటాపురం(కె)లో..



ఏటూరునాగారం: పోలీసుల బందోబస్తు..



ఏటూరునాగారం: తనిఖీ చేస్తున్న సిబ్బంది



మంగపేటలో..



ఏటూరునాగారం జెడ్పీహెచ్ఎస్ వద్ద..



వెంకటాపురం(కె)లో..



వాజేడు: పరీక్ష కేంద్రం వద్ద వైద్య సిబ్బంది

మిషన్ భగీరథ కార్మికుల ధర్నా



ధర్నా చేస్తున్న కార్మికులు

ఏటూరునాగారం: మూడు నెలలుగా వేతనాలు అందించడం లేదంటూ మిషన్ భగీరథ కార్మికులు శుక్రవారం ఏటూరునాగారం మండలంలోని రొయ్యూరు భగీరథ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ.. ప్రతీ కార్మికుడికి వెంటనే ఐడీ కార్డులు ఇవ్వాలని, పీఎఫ్, ఈఎస్ఐ వెంటనే వర్తింపజేయాలన్నారు. రెండు సంవత్సరాల నుంచి పెరగాల్సిన జీతాలు వెంటనే పెంచి ఏప్రిల్ నుంచి అమలు చేయాలని డిమాండ్ చేశారు.

సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం

- కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దేవేందర్



చెక్కులను పంపిణీ చేస్తున్న దేవేందర్

ఎస్ఎస్‌తాడ్వాయి: సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరమని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బొల్లు దేవేందర్ అన్నారు. మండలంలోని కల్లెబోయిన భద్రయ్య, గౌరమ్మ, సూర్యనారాయణ, పోలెబోయిన సృజన, పూనెం లోకేష్, పూనెం లోకేష్‌కు శుక్రవారం సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దేవేందర్ మాట్లాడుతూ.. సీఎం రిలీఫ్ ఫండ్‌ను పేదలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మేడారం జాతర చైర్మన్ లచ్చుపటేల్, ఎస్టీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి పీరిల వెంకన్న, సింగిల్ విండో డైరెక్టర్ రంగర బోయిన జగదీశ్, గ్రామ కమిటీ అధ్యక్షుడు పాక రాజేందర్, నాయకులు ఆలేటి జైపాల్ రెడ్డి, అనుమాండ్ల రాజిరెడ్డి, సోషల్ మీడియా మండల ఇన్‌చార్జ్ గజ్జల రాజశేఖర్ ఉన్నారు.

బస్సు సర్వీస్ ప్రారంభం

టేకుమట్ల: జమ్మికుంట-ఓడేడ్ వయా వెంకట్రావుపల్లి మీదుగా బస్సు సర్వీస్‌ను ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని ఆర్టీసీ అధికారులు కోరారు. శుక్రవారం వెంకట్రావుపల్లి-ఓడేడ్, జమ్మికుంటకు బస్సు సర్వీస్‌ను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానికులు ఆర్టీసీ డ్రైవర్, కండక్టర్లను శాలువాలతో ఘనంగా సన్మానించి, స్వీట్లు పంచారు.

అడవుల సంరక్షణతోనే మానవ మనుగడ

- ప్రిన్సిపాల్ డాక్టర్ కొప్పుల మల్లేశం



వాజేడు: విద్యార్థులకు అడవుల గురించి వివరిస్తున్న ఉపాధ్యాయులు

ములుగు: అడవుల సంరక్షణతోనే మానవ మనుగడ సాధ్యమని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కొప్పుల మల్లేశం అన్నారు. ప్రపంచ అటవీ దినోత్సవం సందర్భంగా కళాశాల ఏకో క్లబ్ కన్వీనర్ డాక్టర్ సరిత ఆధ్వర్యంలో ఏర్పాటు చేసి అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రతీ వ్యక్తి అటవీ సంరక్షణకు కృషి చేయాలన్నారు. అనంతరం కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. పోస్టర్ ప్రజెంటేషన్ పోటీలలో విజేతలుగా నిలిచిన విద్యార్థులు రంజిత్, శిరీష, మరియం, రబియా, సుచిత్ర, శ్రావ్య, శృతి, పునీత, యమునలకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బాలయ్య, అధ్యాపకులు కవిత, సరిత, నాగమణి, శిరీష, అనిల్‌కుమార్, విజిత, శంకర్, ఉదయశ్రీ, తేజోలత, శ్రీను, మహ్మద్‌మౌలానా, అనిత, రమేష్, లక్ష్మీ, ఐలయ్య, షరీఫా తదితరులు పాల్గొన్నారు.

వాజేడు: వృక్షాలు మానవ మనుగడకు ఎంతో ముఖ్యమని గుమ్మడిదొడ్డి ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు రాజు, నాగరాజు అన్నారు. మండల పరిధిలోని గుమ్మడిదొడ్డి ప్రభుత్వ పాఠశాలలో శుక్రవారం ప్రపంచ అటవీ దినోత్సవాన్ని విద్యార్థులతో కలిసి నిర్వహించారు. చెట్లను పెంచడం ప్రతి ఒక్కరూ బాధ్యతగా గుర్తించాలని సూచించారు.



ములుగు: మొక్క నాటుతున్న ప్రిన్సిపాల్ మల్లేశం

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు



చిట్యాల: మండలంలోని గిద్దెముత్తారంలో సమ్మర్ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా అధికారుల సూచనలు మేరకు విద్యుత్ ట్రాన్స్‌పార్మర్లు ఏర్పాటు చేసినట్లు ట్రాన్స్‌కో ఏఈ చంద్రశేఖర్ తెలిపారు. శుక్రవారం గ్రామంలో 100 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్, సింగిల్ ఫేస్ కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగకుండా తగు ఏర్పాట్లు చేస్తునట్లు తెలిపారు. విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.